సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 24 । జూన్ । 2025



డీఆర్‌ఓకి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, పిరియా విజయ, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు, కిల్లి సత్యనారాయణ, మెంటాడ స్వరూప్, ధర్మాన కృష్ణ చైతన్య, తమ్మినేని చిరంజీవి నాగ్ తదితరులు

జడివానలో యువగర్జన : శ్రీకాకుళం నగరంలో యువతపోరుకు హాజరైన నిరుద్యోగులు, యువత, విద్యారులు, పార్టీశ్రేణులు



సర్కారుపై యువత ఫైర్

నిరసనల జడివాన ముందు కురిసిన వానజల్లు చిన్నబోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఎగ్గొట్టారంటూ సర్కారుపై విమర్శల వర్షం.. 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ పోయాయి? నెలకు మూడువేల నిరుద్యోగ భృతి ఏమైందన్న నిలదీతలతో నగరం హోరెత్తింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత చంద్రబాబు మోసపూరిత పాలనపై విరుచుకుపడింది. ఏడాదిగా సర్కారు చేస్తున్న మోసాలను గణాంకాలతో సహా ఎత్తి చూపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీసింది. ఫీజులు కట్టలేక యువత అవస్థలు పడుతుంటే.. ఏడాది సంబరాలు చేసుకుంటున్న కూటమి తీరుపై ఆగ్రహం పెల్లుబికింది. సర్టిఫికెట్లు తెచ్చుకోలేక అనేక మంది ఆపసోపాలు పడుతుంటే.. మౌనాసనాలు వేస్తున్న ప్రభుత్వ వైఖరిపై యువత కోపం కట్టలు తెంచుకుంది. నిరుద్యోగ భృతిపై హామీ ఇచ్చి మర్చిపోయిన నాయకులకు ఆ మాటలు గుర్తుకు వచ్చేలా యువతరం నినదించింది. వైఎస్సార్‌సీపీ యువత పోరు వేదికగా తమ ఆవేదనను తెలియజెప్పింది. జడివానకు వెరవకుండా అడుగులు కదిపి ప్రభుత్వానికి హెచ్చరిక పంపింది.



ప్లకార్డులు చూపిస్తున్న యువత

- వైఎస్సార్ సీపీ 'యువత పోరు'లో చంద్రబాబుపై మండిపడిన నిరుద్యోగులు
- ఫీజుల కోసం ధ్వజమెత్తిన విద్యార్థుల తల్లిదండ్రులు
- బాబు సర్కార్ తీరుపై శ్రీకాకుళంలో భారీ నిరసన ర్యాలీ
- జడివానను లెక్క చేయకుండా జిల్లా పరిషత్ ఎదుట నిరసన
- నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందేనంటూ యువత గర్జన
- అంతకుముందు బైక్ ర్యాలీలతో జిల్లా కేంద్రానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న రెడ్డి శాంతి మహిళా నాయకులు

ఆస్తులు అమ్ముకుంటున్నారు



రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య చాలా దారుణంగా ఉంది. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఆశ పెట్టిన చంద్రబాబు రూ.7200 కోట్లు బకాయి పెట్టి మౌనంగా ఉంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4200 కోట్లు, వసతి దీవెన రూ.2200 కోట్లు అవసరమైతే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 2014–19 నుంచి టీడీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.17వేల కోట్లు బకాయి పెడితే వైఎస్ జగన్ ఆరు నెలల్లో ఆ బకాయి చెల్లించారు. కానీ చంద్రబాబు బకాయిలు ఇవ్వకపోవడంతో అనేక మంది ఆస్తులు అమ్ముకుని ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వస్తోంది.

– కుంభా రవిబాబు, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు

చంద్రబాబుకు కొత్త కాదు..



హామీలు ఇవ్వడం.. మర్చిపోవడం చంద్రబాబుకు కొత్త కాదు. సొంతమామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడవడం పెద్ద వింతకాదు. హామీలు అమలు చేసే సత్తా లేనప్పుడు ఎందుకివ్వాలి. ఏడాది పాలనలో 80శాతం హామీలు పూర్తిచేశామని చెబుతున్న తీరు చూసి ప్రజలంతా నవ్వుకుంటున్నారన్నారు.

– తమ్మినేని సీతారాం, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త

యువత ప్రశ్నించారు..



కూటమి పాలనలో జరిగిన అన్యాయంపై యువత ప్రశ్నించేందుకు భారీగా రావడం ఆనందంగా ఉంది. నిరుద్యోగులు, యువకులకు కూటమి ప్రభుత్వం రూ.7200 కోట్లు బకాయి పడింది. – ఎంవీ స్వరూప్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం..



జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా యువత, విద్యార్థులు వానను సైతం లెక్కచేయకుండా హాజరైన తీరు చూస్తుంటే ప్రభుత్వంపై ఏస్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థమవుతోంది. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అమలుచేసిన ఒకే ఒక వ్యక్తి వైఎస్ జగన్. వైఎస్సార్ సీపీహయాంలోనే సచివాలయాలు ఏర్పాటు చేసి రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే భవిష్యత్‌లోనూ ఆందోళనలు చేస్తాం. – ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

బాబును జనం నమ్మరు..



ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని చంద్రబాబు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా జనం నమ్మే స్థితిలో లేరు. జగన్ పర్యటన వీడియోను రకరకాలుగా మార్ఫింగ్‌లు చేసి టీడీపీ నేతలు, ఎల్లోమీడియా బురద జల్లుతూనే ఉంది. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఇవ్వాల్సి ఉన్నా.. తూతూమంత్రంగా పాటిస్తున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. – సీదిరి అప్పలరాజు, పార్టీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

యువత తలచుకుంటే..



యువత, విద్యార్థులు తలుచుకుంటే రాజ్యాలే కుప్పకూలి పోతాయి. చంద్రబాబు పాలనకు కూడా అదే గతి పడుతుంది. – మార్పు పృథ్వీ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ శ్రీకాకుళం పీఎన్ కాలనీ / శ్రీకాకుళం పాతబస్టాండ్

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఇవ్వకుండా మోసం చేస్తున్న చంద్రబాబుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. పిల్లలకు చదువులు దూరం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వ కుట్రలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను తీసి వేలాది మంది ఉసురు తీసుకున్నారంటూ ఉపాధిని కోల్పోయిన నిరుద్యోగులు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువత పోరు నిరసనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని నినదించారు. జడివానకు కూడా వెరవకుండా నిరసన ర్యాలీ చేశారు. బైక్ ర్యాలీలు, నిరసన ర్యాలీలతో జిల్లా కేంద్రం శ్రీకాకుళం హోరెత్తింది. భారీగా తరలివచ్చిన జనంతో జిల్లా పరిషత్ ఏరియా దద్దరిల్లింది.



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా...

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం చేపట్టిన యువత పోరు సూపర్ సక్సెస్ అయింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. ప్రారంభమైన దగ్గరి నుంచి ముగింపు వరకు వర్షం పడినా వెనక్కి తగ్గకుండా నిరసన ప్రదర్శనలో గట్టిగా నినదించారు. ప్లకార్డులు పట్టుకుని, వైఎస్సార్ సీపీ జెండా ఎత్తుకుని ప్రభుత్వం తీరును ఎండగట్టారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకున్నారు. యువత పోరు నిర్వహించాల్సిన ఆవశ్యకతను వైఎస్సార్‌సీపీ నాయకులు వివరించారు. చంద్రబాబు చేస్తున్న దగాను, ఏడాదిగా జరుగుతున్న మోసాలను అంకెలతో సహా వెల్లడించారు. అనంతరం తరలివచ్చిన జనంతో జడి వానలోనే ర్యాలీగా జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గరి నుంచి బయల్దేరారు. జిల్లా పరిషత్ వరకు యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు ర్యాలీగా వెళ్లారు. జడివానను లెక్క చేయకుండా జిల్లా పరిషత్ ఎదుట గంటకు పైగా నిరసన తెలియజేశారు. అంతకుముందు జిల్లా నలుమూలల నుంచి బైక్ ర్యాలీలతో యువకులు తరలివచ్చారు. అనంతరం ముఖ్య నాయకులు జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరుగుతున్న గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలని, వసతి దీవెన అందించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని, ఈలోపు నిరుద్యోగ భృతి చెల్లించాలని, తీసేసిన ఉద్యోగాలు మళ్లీ ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయసాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, పిరియా సాయిరాజ్, టెక్కలి, ఆమదాలవలస సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ కాళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ కళింగ వైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్రకార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు దివ్య, పిలక రాజ్యలక్ష్మి, జిల్లా ప్రధానకార్యదర్శి గేదెల పురుషోత్తం, తమ్మినేని చిరంజీవినాగ్, ధర్మాన కృష్ణ చైతన్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి జయ్‌కుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, సాధు వైకుంఠరావు, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, పిల్లల రామకృష్ణ, సీపాన వెంకటరావు, ఎంఏ బేగ్, బొడ్డేపల్లి రమేష్, గొండు కృష్ణమూర్తి, ఎన్ని ధనుంజయరావు, టి.కామేశ్వరి, వైవీ శ్రీధర్, యజ్జల గురుమూర్తి, కోట గోవిందరావు, చిట్టి జనార్ధనరావు, ముకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి పద్మజ, గద్దిబోయిన కృష్ణయాదవ్, ఎండ రమేష్, పీస గోపి, పీస శ్రీహరి, అల్లు లక్ష్మినారాయణ, నల్లబారికి శ్రీను, పిన్నింటి సాయి, సింగుపురం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి చక్రవర్తి, నియోజకవర్గాల అధ్యక్షులు గుండ హరీష్, భరద్వాజ్, బొడ్డేపల్లి విశ్వేశ్వరరావు, దండి ప్రకాష్, చిన్ని జగ్గారావు, దున్న హరికృష్ణ, నర్తు ప్రేమ్‌కుమార్, రావాడ పాపారావు, వజ్జ వెంకటప్పలనాయుడుతో పాటు భారీగా యువత బైక్‌ర్యాలీ చేశారు.



ఉత్సాహంగా బైక్ ర్యాలీ

న్యూస్‌రీల్

'యువత పోరు విజయవంతమైంది'

నరసన్నపేట: జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యువత పోరు విజయవంతమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పార్టీ సమన్వయకర్తలు, యువజన విభాగాల నాయకులు, ప్రత్యేకంగా నరసన్నపేట నుంచి 300 ద్విచక్ర వాహనాల ర్యాలీ ఆకట్టుకుందన్నారు. అలాగే యువత పోరు విజయవంతం కావడంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, జిల్లా అధ్యక్షుడు పృథ్వీ సమన్వయంతో పనిచేశారని కితాబునిచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోరాటం కూటమి ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని పేర్కొన్నారు.

తిలారు ఫ్లై ఓవర్‌పై నుంచి ఆర్టీసీ బస్సులు

సారవకోట: జలుమూరు మండలంలోని తిలారు గేట్ పై నిర్మించిన ఫ్లై ఓవర్ పై ఆర్టీసీ బస్సులు మంగళవారం నుంచి ప్రయాణిస్తాయని ఆర్టీసీ మేనేజర్ రవిశంకర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్లే బస్సులు మాత్రమే తిలారు ఫ్లై ఓవర్ పై నుంచి వస్తున్నాయని, పాతపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చే బస్సులు చల్లవానిపేట మీదుగా జర్జంగి, హరిశ్చంద్రాపురం, నిమ్మాడ నుంచి నరసన్నపేట వస్తున్నాయన్నారు. మంగళవారం నుంచి శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు తిలారు దగ్గర సర్వీసు రోడ్డులో నడుస్తాయని పాతపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చే బస్సులు మాత్రం ఫ్లై ఓవర్ పై నుంచి వస్తాయన్నారు.

పునరావాస కాలనీ పరిశీలన




కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమసుందర్

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: మూల పేట పోర్టు నిర్వాసిత గ్రామమైన విష్ణుచక్రం గ్రామానికి కేటాయించిన పునరావాస కాలనీని తహసీల్దార్ హేమసుందర్ పరిశీలించారు. 'ఊరిని వదిలేసి వస్తే... గాలికొదిలేస్తారా..' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. జోరువానలో కూడా పునరావాస కాలనీ పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. ఎర్త్ ఫిల్లింగ్ పూర్తిస్థాయిలో చేయిస్తామని, మరుగుదొడ్లకు తలుపులు వేయిస్తామని, మురికి కాలువ నిర్మాణం త్వరలోనే చేయిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస కాలనీలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని విద్యుత్ లైన్‌మెన్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్ఐ ప్రసన్న తదితరులు ఉన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష సమయాల్లో మార్పు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారిలో జిల్లా వ్యాప్తంగా బాలురకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్లలోను పరీక్షలు జరుగుతాయి. జూన్ 25న బుధవారం 6, 7వ తరగతులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, అదే రోజు మధ్యాహ్నం 8, 9వ తరగతులకు 2 నుంచి 3 వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమయాల్లో మార్పులను గమనించాలని ఆమె కోరారు. సందేహాలుంటే 9701736862/9000314209 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

బూతులు తిట్టి.. కాలర్ పట్టుకుని నెట్టేసి

- సచివాలయ ఉద్యోగిపై జనసేన నాయకుడు బస్వ గోవిందరెడ్డి దౌర్జన్యం
- అతడు ఇదివరకే పలు కేసుల్లో నిందితుడు



రణస్థలం: కూటమి నాయకుల దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి. జనంపై పెత్తనం చెలాయించడమే కాకుండా ఉద్యోగులను కూడా వేధిస్తున్నారు. తాజాగా జనసేన పార్టీ రణస్థలం మండలాధ్యక్షుడు బస్వ గోవిందరెడ్డి ఈ నెల 20వ తేదీన కొచ్చెర్ల గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కె.మోహన్‌రావుపై దాడికి తెగబడడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 20వ తేదీన మోహనరావు ఉదయం 10.30 గంటలకు సచివాలయానికి వచ్చి తన పని తాను చేసుకుంటున్నాడు. ఆ సమయంలో బస్వ గోవిందరెడ్డి సచివాలయానికి వచ్చి గతంలో తాను చెప్పిన పని ఏం చేశావని గట్టిగా అడిగాడు. యోగాంధ్ర, తల్లికి వందనం వంటి పనుల్లో బిజీగా ఉన్నానని, ఆ పని పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లో ఉందని సమాధానం చెప్పినా వినకుండా తాను చెప్పిన పని ముందు చేయకుండా మిగతా పనులు చేసుకుంటావా అని బూతులు తిట్టారు. అంతటితో ఆగకుండా కాలర్ పట్టుకుని నెట్టేశారు. ఆ సమయంలో సచివాలయంలో మహిళా పోలీస్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఉన్నారు. ఈ అనుకోని ఘటనతో తీవ్రంగా మనస్తాపం చెందిన మోహనరావు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. సోమవారం తోటి ఉద్యోగులతో కలిసి మండల పరిషత్ ఏఓ మార్కండేయకు వినతి పత్రం ఇచ్చారు.

గోవిందరెడ్డి అంటే అధికారులకు హడల్

జనసేన మండలాధ్యక్షుడు బస్వ గోవిందరెడ్డి ఓ రౌడీ షీటర్. అతనిపై పలు కేసులు ఉన్నాయి. గతంలో ఒక కుటుంబం వద్ద నగదు తీసుకుని చెల్లించకపోగా ఆ కుటుంబంపై విచక్షణారహితంగా దాడి చేయడంపై అప్పట్లో కేసు నమోదైంది. ఇక కొచ్చెర్ల గ్రామ సచివాలయంపై ఉద్యోగులపై ఎన్నో మార్లు చిందులు తొక్కిన ఘటనలు ఉన్నాయి. 2022 సమయంలో గ్రామ సచివాలయ భవనాలు కడుతున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరిపై ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ నానా యాగీ చేశాడు. జగనన్న కాలనీ లబ్ధిదారులపై దాడి, కొచ్చెర్ల ప్రేమ జంటతో పాటు వాళ్ల కుటుంబం పైన దాడి వంటి అనేక కేసులున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీ శ్రీకాకుళం –1, 2 డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపోలలో ఔట్ సోర్సింగ్ కార్మికులు దాదాపుగా 220 మంది పని చేస్తున్నారన్నారు. వీరి వేతనం దోపిడీకి గురవుతోందని అన్నారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దాసరి కిరణ్, కార్యదర్శి పి.సంతోష్, జిల్లా ట్రెజరర్ ఆర్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్‌కు స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ జూన్ 23 నుంచి జూన్ 28 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో 2వ విడత మీజిల్స్ రుబెల్లా నిర్మూలనా కార్యక్రమం బ్యానర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ మీజిల్స్ రుబెల్లా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జూన్ 23 నుంచి జూన్ 28 వరకు జిల్లా వ్యాప్తంగా ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామ్స్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 182 మంది ఎంపిక


జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 246 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు బి.టి.ఇవెంజిల్, బి.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్‌మేళాలో 182 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వి.ల్యూక్‌పాల్, అధ్యాపకులు జి.కనవయ్య, వి.శాంతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లా సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: బీఆర్‌ఏయూ అనుబంధ లా కాలేజీలో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం విడుదల చేశారు. మూడేళ్ల కోర్సుకు సంబంధించి 1,3,5 సెమిస్టర్లు, ఐదేళ్ల న్యాయశాస్త్రం కోర్సుకు సంబంధించి 1,3,5,7,9 సెమిస్టర్ పరీక్ష ఫలితాలు వెల్లడించారు. మూడేళ్ల న్యాయ శాస్త్రంలో ఒకటో సెమిస్టర్‌కు సంబంధించి 110 మంది పరీక్షకు హాజరు కాగా 89 మంది, మూడో సెమిస్టర్‌లో90 మందికి 88 మంది, ఐదో సెమిస్టర్‌లో 94 మందికి 94 మంది ఉత్తీర్ణతను సాధించారని తెలిపారు. ఐదేళ్ల న్యాయ శాస్త్ర కోర్సులో ఒకటో సెమిస్టర్‌కు సంబంధించి 29 మందికి 18 మంది, మూడో సెమిస్టర్ 24 మందికి 22 మంది, ఐదో సెమిస్టర్‌లో 28 మందికి 27 మంది, ఏడో సెమిస్టర్‌లో 20 మందికి 20 మంది, తొమ్మిదో సెమిస్టర్‌లో 25 మందికి 25 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌తో పాటు జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. సందేహాలున్న విద్యార్థులు 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


ఏపీ పీఈ సెట్ పరిశీలకుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: ఈ విద్యా సంవత్సరంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏపీపీఈ సెట్– 2025కు పరిశీలకునిగా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం క్రీడా కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. దీనికి సంబంధించి సెట్ కన్వీనర్ పి.జాన్సన్ వర్సిటీకి నియామక ఉత్తర్వులను అందించారు. వ్యాయామ, క్రీడా నైపుణ్యాల పరీక్షలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.


అన్నదాత సుఖీభవ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న వృద్ధుడు

అన్నదాత సుఖీభవ అనేదెప్పుడు..?



- ప్రారంభమైన ఖరీఫ్ పనులు
- 'అన్నదాత సుఖీభవ' నిధుల కోసం ఎదురుచూపులు
- ఏటా జూన్ 10లోపే జమచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి హయాంలో తీవ్ర జాప్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

అవసరమైనప్పుడే సాయం చేయాలి.. పుణ్యకాలం కాస్తా అయిపోయాక సాయం అందినా లాభముండదు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ పనులు మొదలైపోయాయి. రైతన్నలు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు, నేటికీ రైతుల వివరాలు ఎన్‌ఐసీలో సక్రమంగా అప్‌లోడ్ చేయలేదు. వెబ్ ల్యాండ్ వివరాలతో ఈ–క్రాప్ సింక్ అవ్వకపోవడం వంటి సాంకేతిక సమస్యలు అనేకం ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఒక ఏడాది అన్నదాత సుఖీభవ పూర్తిగా ఎగ్గొట్టేశారని రైతులంతా మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులకు వెన్నుపోటు పొడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రైతులు కూడా ఆ జాబితాలో చేరిపోయారు.

పెట్టుబడికి కష్టాలు

అనుకున్న సమయానికి ప్రభుత్వం సాయం అందకపోవడంతో సన్నకారు రైతులు అప్పులు చేయక తప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది కలగకుండా సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం గత ఏడాది పూర్తిగా సాయం ఇవ్వకుండా వదిలేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు తేదీ కూడా ప్రకటించలేదు. దీంతో రైతుకు పెట్టుబడి కష్టాలు పెరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో..

జగన్ సర్కార్ రైతుకు ఇబ్బందులు కలగకుండా వైఎస్సార్ రైతు భరోసా సొమ్ము సకాలంలో ఖాతాల్లో జమ చేసేది. ఖరీఫ్ పంట వేసేముందు ఏటా సరిగ్గా మే నెలలో 'వైఎస్సార్ రైతు భరోసా' కింద రూ.7,500 జమ చేసేది. తర్వాత అక్టోబర్ నెలలో ఖరీఫ్ పంట కోతతో పాటు రబీ సాగు అవసరాల కోసం రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చేది. ఆ తర్వాత జనవరి నెలలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు... ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు 'వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్' ద్వారా మొత్తం రూ.13,500 చొప్పున గత ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక పథకాలు ద్వారా గత ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు అందిన లబ్ధి

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి(రూ.కోట్లలో)
2019–20	2.58 లక్షలు	348.50
2020–21	2.91 లక్షలు	393.52
2021–22	3.07 లక్షలు	414.57
2022–23	3.10 లక్షలు	393.14
2023–24	3.21 లక్షలు	434 కోట్లు

రైతన్నను ఆదుకోవాలి



వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దుక్కి దున్నడంతో పాటు విత్తనాలు పోసేందుకు చేతిలో చిల్లి గవ్వ లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతుభరోసా డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రైవేటు దళారుల్ని ఆశ్రయించి అప్పులు వాడాలి వస్తోంది. ప్రభుత్వం చొరవ చూపి ఈ సీజన్‌కి కావాల్సిన డబ్బులు ప్రభుత్వం ఇచ్చేలా చూడాలి.

– మజ్జి రమణ, అన్నంపేట గ్రామం, బూర్జ మండలం

ఆదేశాలు వచ్చిన వెంటనే..



ప్రభుత్వం ఇప్పటికే అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో వేసేందుకు అడుగులు ముందుకేస్తుంది. రైతుల డేటాను అప్‌లోడ్ చేసి అర్హులందరికి అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. 20వ విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ డబ్బులు కలిపి ఒక్కసారి జమ చేసేందుకు కృషి చేస్తున్నాం.

– త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

శాన్‌ఫ్రాన్సిస్కోలో సెంచూరియన్ వర్సిటీ ప్రదర్శన


శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ–మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమైంది, 25 వరకు కొనసాగనుంది. సెమీ కండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'చిప్స్ టు సిస్టమ్స్' అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజరు కావడం విశేషం. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరియన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎన్‌రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి వర్సిటీగా సెంచూరియన్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీ కండక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్ఫ్యా సెమీ కండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. విద్యతో పాటు సాంకేతిక ఆవిష్కరణల్లోనూ వర్సిటీ గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన పారిశ్రామిక రంగానికి అక్కరకు వచ్చే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి


ఆర్‌అండ్‌బీ రోడ్డులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి లేదా సంక్షేమ పథకాలైనా అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా ఆర్ అండ్ బీ బంగ్లా రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అంగన్‌వాడీలను సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందువలన సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు(ఎఫ్.ఆర్.ఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు.

వేధింపులకు పాల్పడుతున్నారు

కోటబొమ్మాళి మండలంలో అంగన్‌వాడీలపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గత నెలలో ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లను రాజకీయ కక్షలతో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన అంగన్‌వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్‌లో డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.హైమవతి, పి.లతాదేవి, కె.సుజాత, జి.కాంచన, కె.లక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి, పి.రమణమ్మ, వి.హైమవతి, కె.మోహిని, జ్యోతి, టి.రాజేశ్వరి, వై.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

- ఆఫ్‌షోర్ నిర్వాసితుల నిరసన


ర్యాలీగా వస్తున్న నిర్వాసితులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆఫ్‌షోర్ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వాసితులతో కలిసి జిల్లా జెడ్పీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా ప్రాజెక్టు పని నత్తనడకగా సాగుతోందని ధ్వజమెత్తారు. నిర్వాసితులు చాలా రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచినప్పటికీ నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

సమావేశం ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఉన్న మంత్రులు, పలాస, పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని, నిర్వాసితులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమస్య పరిష్కారమయేంతవరకు ఎంతటి పోరాటమైన కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. 18 ఏళ్ల నిండిన యువతి, యువకులకు యూత్ ప్యాకేజీ మంజూరు చేయాలని, నిర్వాసితులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జీవో ప్రకారం పూర్తిస్థాయి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌వో నిర్వాసితులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టిలో పెడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శిర్ల ప్రసాద్, చీపురుపల్లి గ్రామ సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా కిల్లాన

శ్రీకాకుళం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా కిల్లాన శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ సోమవారం నియామక ఉత్తర్వులు అందించారు. ఎస్‌బీసీ అభివృద్ధి అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీనివాసరావు గత ఐదు సంవత్సరాలుగా బీసీ సంఘంలో పనిచేస్తూ సంఘ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేశారు. తనను నియమించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

డాబా పైనుంచి జారిపడి వృద్ధుడు మృతి


అప్పలనాయుడు (ఫైల్)

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన జద్దు అప్పలనాయుడు (67) డాబా పైనుంచి జారిపడి సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబీకులు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు జద్దు అప్పలనాయుడు ఉదయాన్నే ఇంటి డాబాపైకి వెళ్తుండగా కళ్లు తిరిగి పైనుంచి కిందకి పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లచ్చమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. భార్య లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ప్రజల నుంచి 58 అర్జీలు అందాయి. అదనపు ఎస్పీ కె.వి.రమణ అర్జీలు స్వీకరించి సకాలంలో పరిష్కరించేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో లోకనాథం మృతదేహం

నందిగాం: మండల పరిధిలోని మద్దిలివానిపేట వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరేంద్రపురం పంచాయతీ నారాయణపురానికి చెందిన మెట్ట లోకనాథం(55) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లోకనాథం తన పొలంలో విత్తనాలు చల్లడానికి వెళ్లి తిరిగి నారాయణపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. అయితే అదే సమయంలో పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఎగిరిపడి రోడ్డు మీద పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లీలావతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని విక్రాంపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామానికి చెందిన బి.నారాయణ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా, విక్రాంపురం గ్రామ సమీప రహదారిపై తన వాహనంలోని సామగ్రి జారుతున్నాయని ఒక్కసారిగా బైక్ ఆపాడు. అయితే అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో నారాయణతో పాటు రోడ్డు పక్కనుంచి నడిచి వెళ్తున్న విక్రాంపురం గ్రామానికి చెందిన జి.కృష్ణారావు సైతం గాయపడ్డాడు. దీంతో వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా విడుదల

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీకాకుళం నూజివీడు, ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు సోమవారం విడుదల చేశారు. మొత్తం నాలుగు ట్రిపుల్ ఐటీలకు 50,541 మంది దరఖాస్తు చేసుకోగా 4040మందితో కూడిన మెరిట్ జాబితాను నూజివీడు క్యాంపస్ చాన్స్‌లర్ కె.మధుమూర్తి వెల్లడించారు. వీరిలో ప్రభుత్వ విద్యార్థులు 94.78 శాతం మంది ఉండగా, 5.22 మంది ప్రైవేటు పాఠశాలల్లో చదువుకున్న వారు ఉన్నారు. బాలికలు 69.01 శాతం కాగా బాలురు 30.99 శాతం మంది ఉన్నారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్‌జీయూకేటీ.ఇన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. వీరికి ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వతేదీ వరకూ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 30, 1న నూజివీడు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లకు ఎంపికైన వారికి, జూలై 2, 3 వ తేదీల్లో శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి, 4, 5 తేదీల్లో ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన వారికి సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. మన జిల్లా నుంచి మొత్తం 351 మంది ఎంపిక కాగా వీరిలో నూజివీడుకు 91 మంది, ఆర్‌కేవ్యాలీకి 27 మంది, ఒంగోలుకు 44, శ్రీకాకుళం జిల్లాకు 189 మంది ఉన్నారు. మెరిట్ జాబితాలో మందస మండలంలో హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కంచరాన జ్యోషిత 3 వ స్థానంలో నిలిచింది.

బంగారం చోరీ


ఇంట్లోకి వెళ్లడానికి తొలగించిన కిటికీ గ్రిల్

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం గణేష్ కాలనీలోని ఒక ఇంట్లో బంగారం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గణేష్ కాలనీలో నివాసముంటున్న కృష్ణవేణి లఖిదాసుపురం సచివాలయంలో ఏఎన్‌ఎంగా పని చేస్తుంది. ఆదివారం తన ఇంటికి తాళం వేసి హరిదాసుపురంలో ఉన్న కన్నవారింటికి వెళ్లింది. తిగిరి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కొన్ని వస్తువులు చిందరవందరగా ఉండడాన్ని గమనించింది. అనుమానంతో బెడ్‌రూమ్ తలుపు తీయగా అక్కడ ఉన్న కిటికీ గ్రిల్ సగం తీసి వేసి ఉంది. మరో గదిలో ఉన్న ఇనుప బీరువాను చూడగా బీరువా తలుపు వంచి ఉండటం గమనించి చూడగా, లోపల ఉండాల్సిన బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. టెక్కలి సీఐ శ్రీనివాసరావు కృష్ణవేణి ఇంటిని పరిశీలించి, క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సుమారు 16 తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబు, గ్లాసు, పళ్లెం తదితర వస్తువులు పోయినట్లు తెలిపింది.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు
- మీకోసంలో 106 అర్జీల స్వీకరణ


అధికారులకు సమస్య వివరిస్తున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఏపీఈపీడీసీఎల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్ తదితర శాఖల సమస్యలు ఉన్నాయి. అర్జీలు స్వీకరణలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయా శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్షించారు. అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పింఛన్లు పునరుద్ధరించాలి

ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం కటకమయ్యపేట గ్రామంలో ఇద్దరు వితంతువులకు నిలిపివేసిన పింఛన్లను పునరుద్ధరించాలని ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. వితంతువులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, గత కొన్ని సంవత్సరాలుగా పింఛన్లు పొందుతున్నప్పటికీ కేవలం రాజకీయ కారణాలతో గత 8 నెలలుగా పింఛన్ నిలిపివేశారని తెలియజేశారు. అధికారులు స్పందించి ఆ నిరుపేదలను ఆదుకోవాలని కోరారు.

అక్రమ ఇసుక ర్యాంపుల నిర్వహణ ఆపాలి

శ్రీకాకుళం రూరల్ మండలం నైర గ్రామం పరిసరాల్లోని వంశధార నదిలో అక్రమ ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్నారని, వాటిని నిలుపుదల చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం మండల ప్రధాన కార్యదర్శి ఊటపల్లి కృష్ణారావు కోరారు. నైర గ్రామ పరిధిలో వంశధార నుంచి వాటర్ స్కీమ్‌లు ఏర్పాటు చేశారని, ఈ అక్రమ తవ్వకాల వలన ప్రాజెక్టుకు నష్టం జరిగే పరిస్థితి ఉందని తెలిపారు. వాల్టా చట్టం పరిధిలో అక్రమ ఇసుక ర్యాంపులు ఆపాలని విన్నవించారు. శ్రీకాకుళం మండలానికి 20 సంవత్సరాల నుంచి 75 శాతం మంది ప్రజలకు తాగునీరు సక్రమంగా దానినుంచే అందుతోందని తెలిపారు.

పాఠశాల భవనం నిర్మించాలి

తమ గ్రామంలో ప్రాథమిక పాఠశాల నిర్వహించేందుకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలాకి మండలం దీర్ఘాశి గ్రామ పంచాయతీ కింజరాపువానిపేటకు చెందిన ప్రజలు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు జిల్లా పరిషత్ గేట్ వద్ద నిరసన చేపట్టారు. తమ గ్రామంలో 100 కుటుంబాలకు పైగా ఉన్నాయని, ప్రస్తుతం పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం గ్రామస్తులే చందాలు వేసుకొని అద్దె కట్టి పాఠశాల నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో నూతన భవనాన్ని మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ఉన్న పిల్లలు ఐదో తరగతి వరకు ఇక్కడే చదివేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


జెడ్పీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు